
ఇటొస్తే జాగ్రత్తగా ఉండాల్సిందే!

- కుంచించుకుపోతున్న 'ఎర్రకట్ట'
- జారిపోతున్న కట్టమట్టి
- శిథిలావస్థకు చేరుకున్న రైల్వే బ్రిడ్జి



ప్రమాదకరంగా మారుతున్న ఎర్రకట్ట రహదారి



శిథిలావస్థకు చేరుకున్న ఎర్రకట్టపై రైల్వే బ్రిడ్జి

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఎర్రకట్ట రహదారిపై అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇక్కడ ఎర్రమట్టి జారిపోతూ ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు ఈ రహదారిపై నిర్మించిన రెండు రైల్వే బ్రిడ్జిలు కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో వారు మరింత భయందోళన వ్యక్తం చేస్తున్నారు. గొల్లపూడి నుంచి భవానీపురం, చిట్టినగర్ మీదుగా బీఆర్టీఎస్ రోడ్డు, గాంధీనగర్, ఏలూరురోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు వాహనచోదకులు ఎక్కువగా ఎర్రకట్టని వినియోగిస్తుంటారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా కనిపిస్తుంది. దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల సందర్భంలో ఈ దారి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లిస్తుంటారు.

పటిష్టత ప్రశ్నార్థకం

పెజ్జోనిపేట, కంసాలిపేట ప్రాంతాల నుంచి విస్తరించిన ఎర్రకట్ట రహదారిలో కొంతమంది స్థానికులు కట్ట మట్టిని తొలగించి ఆక్రమణలు చేపట్టారు. దీంతో రోజురోజుకూ కట్ట మట్టి జారిపోయి రోడ్డు పటిష్టత కోల్పోతోంది. దీంతో రహదారి సైడులు కుంగి, దానిపై ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లు కూడా జారిపోయాయి. దీని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

ఎర్రకట్ట రహదారిలో రెండు ప్రధాన రైల్వే లైన్లు ఉండటంతో సుమారు 35 ఏళ్ల క్రితం రైల్వేశాఖ రెండు బ్రిడ్జిలను నిర్మించింది. దీనికి అనుసంధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఎర్రకట్ట రహదారి ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి పశ్చిమ నుంచి తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాలకు సులువుగా వెళ్లేందుకు వాహనదారులకు అవకాశం కలిగింది. ప్రస్తుతం ఈ బ్రిడ్జిల సైడు రక్షణ గోడలు కూలిపోవడం, ఫోర్మెన్ బంగళా వద్ద బ్రిడ్జి రిటైనింగ్ వాల్స్ పగుళ్లు ఏర్పాడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. స్థానికుల ఆందోళన చేపట్టడంతో రెండేళ్ల క్రితం రైల్వే అధికారులు ఇనుప గడ్డర్‌లతో రిటైనింగ్ వాల్స్‌కు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు.



ఎర్రకట్ట వద్ద జారిపోతున్న కట్టమట్టి



అదుపుతప్పి జారిపోయిన ద్విచక్ర వాహనాన్ని బయటకు తీసుకొస్తున్న స్థానికులు (ఫైల్)

నిత్యం ఆందోళనే

ఎర్రకట్ట రహదారి రెండు వైపులా మట్టి జారిపోయి ప్రమాదకరంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా రాత్రుళ్లు ఎర్రకట్ట మీదుగా లారీలు, టిప్పర్‌లు వంటి భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశిస్తుండటంతో అంతంతమాత్రంగా ఉన్న ఎర్రకట్ట పటిష్టత దెబ్బతిని రోడ్డుకు రెండు వైపులా కుంగింది. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిపెట్టి ఎర్రకట్ట ఆక్రమణలను అడ్డుకుని కట్ట వెంట రిటైనింగ్ వాల్స్‌తో రహదారి పటిష్టతను పెంచాలంటు పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.

వినూత్న ఆవిష్కరణలను నగరంలో అమలు చేయాలి



కమిషనర్‌కు సమగ్ర నివేదికను అందిస్తున్న డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ కార్పొరేటరులు ఇటీవల దక్షిణ భారత విజ్ఞాన యాత్రలో భాగంగా ఆయా నగరాల్లో పరిశీలించిన వినూత్న ప్రాజెక్టులను నగరంలో కూడా అమలు చేయడానికి వీఎంసీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకటసత్యం కమిషనర్‌కు సమగ్ర నివేదికను అందించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో కార్పొరేటర్లతో కలిసిన వీరిద్దరూ ఆయా ప్రాజెక్టులపై కమిషనర్‌తో చర్చించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని బెంగళూరు, మైసూరు, మధురై, నాగర్ కోయిల్, తిరువనంతపురం, కొచ్చి నగరపాలక సంస్థలలో పరిశీలించిన వినూత్న ప్రాజెక్టులను అమలు చేయాలన్నారు. అక్కడ అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్ర నివేదికను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొహమ్మద్ ఇర్ఫాన్, నిర్మల కుమారి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీఎంసీ ఉద్యోగి కుటుంబానికి నష్ట పరిహారం



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 2023 జూలైలో ప్రమాదవశాత్తూ సివేజ్ లైన్ లో పడి మరణించిన వీఎంసీ ఉద్యోగి మాణిక్యాలరావు కుటుంబ సభ్యులకు నష్టపరిహారంగా రూ.20 లక్షలను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కలిసిన బాధిత కుటుంబీలకు కమిషనర్ చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగుల బాగోగులు చూసుకోవడంలో వీఎంసీ ముందుంటుందన్నారు. అనంతరం మృతుని భార్య మేడ యశోదకు చెక్‌ను అందించారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

దుర్గమ్మ చెంత సంగీత కచేరీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం సంగీత కచేరీ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయనగరానికి చెందిన సప్త స్వరాలయ సంగీత కళాశాలకు చెందిన తమ్మిన రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు పలు భక్తి కీర్తనలను ఆలపించారు. అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.

ఇంటి ఎదుట నిలిపిన బైక్ చోరీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి ముందు నిలిపిన బైక్ మాయమైన ఘటన భవానీపురం పీఎస్ పరిధిలో జరిగింది. భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన సయ్యద్ ఫర్దీన్ మహేంద్ర ఫైనాన్స్‌లో రికవరీ ఏజెంట్. తన అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. గత నెల 29వ తేదీ రాత్రి ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు 30వ తేదీ ఉదయం 7 గంటల ప్రాంతంలో చూడగా బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో భవానీపురం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నకిలీ సర్జికల్ వస్తువుల విక్రేతలపై కేసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నకిలీ సర్జికల్ వస్తువులను విక్రయిస్తున్న విక్రేతలపై వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే లైఫ్ స్కాన్ ఐపీ కంపెనీకి చెందిన వన్‌టచ్ బ్లడ్ గ్లూజ్ టెస్ట్ స్ట్రిప్స్ వస్తువులను నకిలీవి వన్‌టౌన్ మెడికల్ మార్కెట్‌లోని సర్జికల్ దుకాణాల్లో విక్రయిస్తున్నారని ఆ కంపెనీకి సమాచారమందింది. దాంతో ఆ సంస్థ ప్రతినిధులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించి ఆ దుకాణాలపై దాడి చేశారు. ఆ క్రమంలో ఎస్‌జీ ఎంటర్‌ప్రైజెస్ సర్జికల్ దుకాణంలో 42 స్ట్రిప్ ప్యాకెట్లు, శ్రీ రూపా ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్‌లో మరో మూడు నకిలీ ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని సీజ్ చేసి ఆ సంస్థ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి చర్యలు తీసుకోవాలని వీఎంసీ, పోలీస్ అధికారులను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఆయా విభాగాల అధికారులతో ట్రాఫిక్ సమస్యపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు, రహదారి కిక్కిరిసిన ప్రాంతాలు, అవరోధాలపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో డీసీపీ చంద్రబోస్, అదనపు డెప్యూటీ పోలీస్ కమిషనర్ (ఏడీసీపీ) ప్రసన్న కుమార్, ఏసీపీ మోహన్ బాబు, సీఐలు ఉమామహేశ్వరరావు, సత్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బైక్‌ను కారు వెనుకనుంచి ఢీ కొట్టిన ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భవానీపురం ప్రియదర్శిని కాలనీకి చెందిన దొంతిరెడ్డి రమణమ్మ గొల్లపూడి పోస్టాఫీసు రోడ్డులో పాలు పట్టేందుకు వెళ్లింది. శుక్రవారం ఉదయం 7గంటల సమయంలో ఆమె అల్లుడు సానికొమ్ము రమణారెడ్డి తన బైక్‌పై ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్తున్నాడు. ఆ సమయంలో గొల్లపూడి హరిజనవాడ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. వారిద్దరూ కింద పడిపోయారు. ఘటనలో రమణారెడ్డికి చేతికి స్వల్పగాయం కాగా రమణమ్మ తలకు ఎడమవైపు బలమైన గాయమైంది. ఆమెను అక్కడికి సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు వీరజవాన్‌కు నివాళి



జవాన్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నేతలు

గుణదల(విజయవాడ తూర్పు): పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో దాయాది సైనికులను వేటాడుతున్న భారత జవాన్ మురళీ నాయక్ మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ పాకిస్తాన్ కవ్వింపు చర్యల్లో భాగంగా కొన్ని రోజులుగా భారత్ సైనికులు శత్రుదేశంతో పోరాడుతున్నారని తెలిపారు. యుద్ధంలో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరత్వాన్ని ప్రదర్శించారని కొనియాడారు. సుమారు 14 మంది శత్రు సైనికులను మట్టుపెట్టిన మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు. మురళి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి అంజలి ఘటించారు.

మైనార్టీలకు అండగా నిలిచింది వైఎస్సార్ సీపీనే

పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



నూతనంగా నియమితులైన నేతలను సత్కరిస్తున్న వెలంపల్లి



నజీర్‌ను అభినందించి సత్కరిస్తున్న గౌస్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మైనార్టీల సంక్షేమానికి అండగా నిలిచిన పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆ పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ బాజీషహీద్, సహాయ కార్యదర్శిగా నియమితులైన షేక్ నజీర్ వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి తమను నియమించటానికి అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు సన్మానించారు. వెలంపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి అమలు చేసిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ శంషే, ఏనుగుల సునీల్, షేక్ గాలిబ్, షేక్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి పోరాడండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కార దిశగా పోరాడాలని పలువురు ముస్లింలు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన విద్యాధరపురానికి చెందిన షేక్ నజీర్‌కు శుక్రవారం అభినందన సత్కారం జరిగింది. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోగల తాజ్ మసీదులో నవ జవాన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నజీర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. కమిటీ సభ్యులు షేక్ ఫారూఖ్, షానూర్, షేక్ గౌస్, ఇర్ఫాన్, బాషా, షేక్ రవూఫ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసి వారి అభ్యున్నతికి విశేష కృషి చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనని గుర్తు చేశారు. తండ్రి బాటలోని నడిచిన జగనన్న ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను నిర్వహించారని గుర్తు చేశారు. ముస్లింల ద్రోహి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే అన్నివర్గాల ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతకు ఉక్కిరిబిక్కిరి అయిపోతోందని పేర్కొన్నారు. సత్కార గ్రహీత ఎస్కే నజీర్ మాట్లాడుతూ తనను గుర్తించి నమ్మకంతో అప్పగించిన బాధ్యతను అంకిత భావంతో నిర్వర్తిస్తానని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్‌లో ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



స్వామీజీల పర్యవేక్షణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న పోతిన మహేష్ దంపతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్లో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6.51 గంటలకు భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ, శైవ క్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీల పర్యవేక్షణలో దాతలు పోతిన వెంకటమహేష్, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరిగింది. తొలుత వీరాంజనేయ స్వామి ఆలయానికి విచ్చేసిన స్వామీజీలకు ఈవో వై. సీతారామయ్య సాదరంగా స్వాగతం పలికారు. జై శ్రీరామ్ నామస్మరణ మధ్య ప్రతిష్ఠ కార్యక్రమం ముందుకు సాగింది. అనంతరం స్వామీజీలు భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు.

ఘనంగా కల్యాణోత్సవం

దాతలు మాట్లాడుతూ ఆలయానికి జీవం ఉండాలంటే ధ్వజస్తంభం ఉండాలన్నారు. ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అర్చకులు పరాశరం పవన్‌కుమారాచార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ, రామరత్నమాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించగా, దాత పోతిన వెంకట మహేష్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ నటరాజ్ షణ్ముఖ కుమార్, వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు గౌతమ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ చేతి వృత్తిదారుల సంఘం నాయకులు తోలేటి శ్రీకాంత్, కూరాకుల నాగ, మాజీ కార్పొరేటర్ జమల పూర్ణమ్మ, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.







'సిందూర్'కు సంఘీభావం

నగరంలో లయోల వాకర్స్, ఇతర సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం బెంజిసర్కిల్ వద్ద ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా కొవ్వొత్తులతో ర్యాలీ చేసి సంఘీభావం తెలిపారు. ఆ ప్రాంతంలో జాతీయ పతాకాలు పట్టుకుని ర్యాలీగా వెళ్తూ భారత్ మాతాకీ జై, జై జవాన్, జై హింద్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

12న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 12వ తేదీ సోమవారం ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ నిర్వహిస్తారని దుర్గగుడి అధికారులు పేర్కొన్నారు. సోమవారం తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుంది. ఘాట్‌రోడ్డు నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం, విద్యాధరపురం, నాలుగు స్థంభాలు, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం 11 కేవీ టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు టీచర్స్ కాలనీ, హెచ్‌బీకాలనీలోని అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, వెలంపలి శ్రీనివాసరావు నగర్‌లోని 450 ఎస్ఎఫ్‌టీ బ్లాక్స్‌లో పైన పేర్కొన్న సమయంలో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.





విస్తృత తనిఖీలు

పాకిస్తాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేస్తుండటంతో నగరంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులు సంయుక్తంగా శుక్రవారం రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేశారు. అనుమానాస్పద లగేజీలు, అనుమానితులను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లోనూ జల్లెడ పట్టారు. నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఇప్పటికే నిఘా వ్యవస్థ ఏర్పాటుచేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





విద్యార్థులు 'మత్తు'కు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీలో సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రేపటి పౌరులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య చెప్పారు. సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ లోని 8 (ఏ) ఎయిర్ ఎన్‌సీసీ ఆధ్వర్యాన శుక్రవారం మాదక ద్రవ్యాలు వద్దు–జీవితం ముఖ్యం అనే నినాదంతో పాఠశాల ఆవరణలో అవగాహన కార్యక్రమం జరిగింది. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు వివిధ రకాల నినాదాలతో పోస్టర్లను రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ క్షణికమైన ఆనందం కోసం యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. యువత చదువుకుని తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాలు సేవించడం, విక్రయించడం, సరఫరా చేసే వారి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ జి.రవి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.